
చంద్రబాబు అభివాదం..


ప్రజావేదిక సభలో పాల్గొన్న గుండుమల గ్రామస్తులు


మంత్రి సత్యకుమార్ స్వాగతం

వెల్‌కమ్ సీఎం సర్..


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత, ఎంపీ బీకే


ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పరిటాల శ్రీరామ్


బొకే అందజేస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న



మారుమూల కుగ్రామం..
సరిహద్దులో..
విసిరేసినట్టుగా ఉంటుంది..
అలాంటి ఊరి జనంతో
మాట్లాడడానికి..
వారి కష్టాలు తీర్చడానికి..
ముఖ్యమంత్రే వస్తున్నారని
తెలియగానే..
సంభ్రమాశ్చర్యాలు..
ఇళ్లు, వాకిళ్లను శుభ్రం చేసుకుని..
పండుగకు సిద్ధం చేసుకుని..
ఎదురుచూశారు..
ఆ రోజు రానే వచ్చింది..
ముఖ్యమంత్రి
చంద్రబాబే స్వయంగా వచ్చారు..
పేదింటి గడప తొక్కారు..
రైతు పొలానికొచ్చారు..
ఊరంతా కలియతిరిగారు..
ఊరి జనంలో ఒక్కరయ్యారు..
అందరి యోగక్షేమాలూ అడిగారు..
గ్రామ దేవత సన్నిధిలో..
అందరితో కలిసి
కూర్చుని మాట్లాడారు..
ఆ జనం ఆనందంతో
ఉబ్బితబ్బిబ్బయ్యారు..
ఆ పల్లె పులకించింది..
మేఘం కూడా వర్షించింది..
జోరు వాన కురిపించింది..
అందరూ ఆనందాల జడివానలో
తడిసిముద్దయ్యారు...

మీ రాకతో..

మేఘం వర్షించింది.. పల్లె పులకించింది..!

మడకశిర, ఆగస్టు 1: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనతో మండలంలోని గుండుమల గ్రామం పులకించిపోయింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నిమిత్తం ముఖ్యమంత్రి గురువారం గుండుమల గ్రామానికి వచ్చారు. పలువురు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి, పింఛన్ సొమ్ము అందజేశారు. వారితో కాసేపు మాట్లాడారు. సమస్యలను అడిగి, తెలుసుకున్నారు. అధైర్యపడొద్దనీ, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మల్బరీ తోట, షెడ్డును పరిశీలించారు. పంట సాగు, పెట్టుబడి, దిగుబడి, మార్కెట్ సౌకర్యం, లాభాలపై ఆరాతీశారు. గ్రామంలోని కరియమ్మ దేవాలయానికి చేరుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో చంద్రబాబు ప్రసంగించారు. గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు ప్రసంగిస్తుండగా.. వాన కురిసింది. ప్రసంగం సాగినంతసేపూ కురుస్తూనే ఉంది. వానలోనే ఆయన ప్రసంగం కొనసాగించారు. జనం కూడా అక్కడి నుంచి కదల్లేదు. వానలో మరింత ఉత్సాహం ప్రదర్శించారు. అందరూ తడిసి ముద్దయినా అక్కడి నుంచి కదల్లేదు. అందరినీ పలకరిస్తూనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


పింఛన్ సొమ్ము అందజేస్తున్న సీఎం చంద్రబాబు


పుట్టపర్తిలో వీడ్కోలు


జోరువానలో ముఖ్యమంత్రి ప్రసంగం

వాన జోరు.. అభిమాన హోరు..

సభలో సంబరం


రండి.. సార్.. మా ఇంటికి..


గ్రామస్తులకు నమస్కరిస్తూ..


రామన్న ఇంట్లో చంద్రబాబు..

ముఖ్యమంత్రి పర్యటన సైడ్‌లైట్స్

మధ్యాహ్నం 3.50కి: సీఎం చంద్రబాబునాయుడు హెలీకాప్టర్‌లో గుండుమలకు రాక
4.00కి: గుండుమల గ్రామంలో వృద్ధుడు రామన్నకు పింఛన్ అందజేత
4.10కి: గ్రామ సమీపంలోని రైతు రంగనాథ్ సాగుచేసిన మల్బరీ తోట, షెడ్డు పరిశీలన
4..20కి: గ్రామంలో ఓబుళమ్మకు వితంతు పింఛన్ పంపిణీ
4.30కి: ప్రజావేదికకు చేరిన సీఎం
4.35కి: ప్రజలను ఉద్దేశించి మొదట 'ఎల్లారు.. చెన్నాగిద్దిరా..' (అందరూ బాగున్నారా) అంటూ కన్నడలో పలకరింపు. మాట్లాడిన పింఛన్ లబ్ధిదారులు రామన్న, ఓబుళమ్మ, మల్బరీ రైతు
5.15కి: సీఎం చంద్రబాబు మాట్లాడుతుండగా కురిసిన వర్షం. జోరువానలో కూడా సభా వేదిక నుంచి కదలని జనం
45 నిమిషాలుపాటు సీఎం ప్రసంగం
6.00కి: హెలీకాప్టర్‌లో పుట్టపర్తికి బయల్దేరిన సీఎం

-మడకశిర రూరల్

తలుపు తట్టిన ఆనందం..!

పండుగలా పింఛన్ల పంపిణీ

జిల్లావ్యాప్తంగా ఉదయాన్నే ప్రారంభం
స్వయంగా అందజేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు
ఉబ్బితబ్బిబ్బయిన లబ్ధిదారులు
అభాగ్యుల మోములో చిరునవ్వులు

ఇంకా తెలవారనే లేదు..
అప్పుడే ఆనందం తలుపు తట్టింది..
తెరిచి చూస్తే..
ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు..
అంతా నిల్చున్నారు..
నమ్మశక్యం కాలేదు..
కళ్లు నులుముకుని చూసినా..
నిజమే.. వారే..
ఆ అభాగ్యుల్లో పట్టరాని ఆనందం..
మోములో నవ్వులు విరబూశాయి..
పెంచిన పింఛన్ సొమ్ము అందించారు..
వారి సంతోషం రెట్టింపైంది..
మాట కలిపి..
కష్టసుఖాలు తెలుసుకున్నారు..
ఆనందాన్ని పంచుకున్నారు..
తామున్నామంటూ ధైర్యం చెప్పారు..
ఆదుకుంటామంటూ అభయమిచ్చారు..
ఈ ఆనందాల ఉదయం..
ఆ అభాగ్యుల జీవితాల్లో
చిరస్మరణీయం..

మాటే రాని నోట.. నవ్వులు చిందెనంట..

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటరెడ్డిపల్లి, కురుబవాండ్లపల్లి, గుట్టూరు గ్రామాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పింఛన్ల పంపిణీ చేపట్టారు. వెంకటరెడ్డిపల్లికి చెందిన రవిశంకర్ కుమారుడు ఎనిమిదేళ్ల హేమంత్‌కు మతిస్థిమితంగా లేదు. మాటలు కూడా రావు. ఆ చిన్నారికి మంత్రి సవిత రూ.6 వేలు దివ్యాంగ పింఛన్ సొమ్ము అందజేశారు. చిన్నారికి ఆనందం పంచారు. నోట మాటరాని ఆ చిన్నారి పట్టరాని సంతోషంతో నవ్వులు చిందించాడు. ఆ నవ్వుల జడిలో అక్కడున్న వారందరూ తడిసిపోయారు.

చిన్నారి హేమంత్‌కు పింఛన్ అందించి.. ఆనందం పంచుకుంటున్న మంత్రి సవిత




వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి సత్యకుమార్


సంతోషం నాయనా..

ధర్మవరం: పట్టణంలోని 22వ వార్డు సాయినగర్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్వతమ్మ ఇంటి వద్దకెళ్లారు. 'పార్వతమ్మా.. బాగున్నారా..' అంటూ ఆమెను ఆప్యాయంగా పలకరించారు. పింఛన్ సొమ్ము అందజేశారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము రూ.4 వేలకు పెంచి, అందజేస్తున్నామన్నారు. పార్వతమ్మ హర్షం వ్యక్తంచేశారు. 'సంతోషం.. నాయనా..' అంటూ ఆనందంగా చెప్పారు.

పుట్టపర్తి, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం జిల్లావ్యాప్తంగా పండుగలా సాగింది. ఉదయం 5.30 గంటలకే ప్రజాప్రతినిధులు, అధికారులు పింఛన్ల పంపిణీ చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర నియోజకవర్గంలోని గుండుమలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మవరంలోని 22వ వార్డులో వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. పెనుకొండ నియోజకవర్గంలోని వెంకటరెడ్డిపల్లిలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్, కలెక్టర్ టీఎస్ చేతన్.. పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కొత్తచెరువు మండలంలోని అప్పలవాండ్లపల్లిలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పలె రఘునాథరెడ్డి పింఛన్ సొమ్ము అందజేశారు. కదిరిలోని నిజాంవలీకాలనీలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు.

మధ్యాహ్నం 3గంటలకే 93 శాతం పూర్తి

జిల్లాలో పింఛన్ల పంపిణీ ఉదయం 5.30 గంటలకే ప్రారంభమైంది. మధ్యాహ్నం 3 గంటలకు 93 శాతం పూర్తిచేశారు. జిల్లా వ్యాప్తంగా 2,69,207 మంది పింఛన్‌దారులు ఉండగా.. రూ.108.14 కోట్లు విడుదలైంది. 2,52,216 మందికి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటల్లోగా వందశాతం పూర్తవుతుందని అధికారులు పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీలో స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకుని, రూ.3వేలు ఉన్న పింఛన్ సొమ్మును రూ.4వేలకు పెంచి అందజేస్తున్నారని నాయకులు వివరించారు. పింఛన్ పంపిణీ పండుగలా సాగింది.


మస్తాన్‌వలీకి పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

పింఛన్.. కుటుంబానికి ఆసరా..

కదిరి: స్థానిక 14వార్డు నిజాంవలీ కాలనీలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. మస్తాన్‌వలీకి వృద్ధాప్య పింఛన్ సొమ్ము రూ.4 వేలు అందజేశారు. లబ్ధిదారుడు మాట్లాడుతూ.. పింఛన్ సొమ్ము పెంచడం ఆనందంగా ఉందన్నారు. తమ కుటుంబానికి ఆసరాగా ఉంటోందని ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తప్పక నెరవేరుస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

సంతోషం.. రెట్టింపు చేస్తాం..

కొత్తచెరువు: మండలంలోని అప్పలవాండ్లపల్లిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన లక్ష్మీపతి నాయక్ పుట్టుకతోనే దివ్యాంగుడు. మంచానికే పరిమితమయ్యాడు. నిరుపేద కుటుంబం. అతడికి దివ్యాంగ పింఛన్ సొమ్ము రూ.6 వేలు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి నాయక్ మాట్లాడుతూ.. పింఛన్ సొమ్ము పెంచడం సంతోషంగా ఉందన్నాడు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పూర్తిగా వీల్‌ఛైర్‌కే పరిమితమైనందుకు పింఛన్ రూ.15 వేలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. పింఛన్ పెంపునకు నివేదికలు పంపాలని అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌ను ఆదేశించారు.


లక్ష్మీపతినాయక్‌కు పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

తల్లి పాలు.. బిడ్డకు అమృతం

మంత్రి సత్యకుమార్

ధర్మవరం, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు అమృతమని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని సాయినగర్‌లోని పీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. తల్లిపాల వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ... తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. ప్రతిఒక్కరూ తల్లిపాల ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం తల్లికి కూడా ఎంతో మేలు చేస్తుందన్నారు. తల్లిపాలు తాగడం వల్ల బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పాలివ్వడం వల్ల తల్లీబిడ్డల బంధం మరింత బలపడుతుందన్నారు. తల్లిపాలపై అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

అన్ని వర్గాల అభివృద్ధికి

ప్రభుత్వం కట్టుబడివుంది

ప్రజావేదికలో సీఎం చంద్రబాబునాయుడు

మడకశిర/మడకశిరటౌన్, ఆగస్టు 1: అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడివుందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. తొలి రోజు 97శాతం పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. గురువారం సత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమల గ్రామంలో జరిగిన ప్రజావేదికలో సీఎం మాట్లాడారు. మంత్రులు సవిత, సత్యకుమార్‌యాదవ్, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు ఎం.ఎస్.రాజు, పరిటాల సునీత, బండారుశ్రావణి, కందికుంట వెంకటప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూరారెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తదితరులు ప్రజావేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒక్క రూపాయి లంచం తీసుకోకుండా అర్హత ఉన్న లబ్ధిదారులకు వంద మంది ఉంటే 97 మందికి ఒక్కరోజులోనే పింఛను అందించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పింఛను పథకాన్ని 1985లో నందమూరి తారకరామారావు రూ.35లతో ప్రారంభించారన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.200 నుంచి రూ.1000 పెంచామని వివరించారు. రూ.1000 నుంచి రూ.2వేలకు, 2024 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.4వేలు ప్రస్తుతం అందిస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు.

రూ. 4 వేలు అందుకోవడం సంతోషంగా ఉంది



ఎన్టీఆర్ భరోసా పింఛను రూ.4వేలు అందుకోవడం సంతోషంగా ఉంది. పేదలపై మీకు ఉన్న ప్రేమతో రూ.4వేలకు పింఛను పెంచి జీవితాల్లో వెలుగులు నింపారు. ఇతర పథకాల ద్వారా కూడా లబ్ధి పొందుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు. టీడీపీ ప్రభుత్వంలో సంతోషంగా ఉంటామన్న నమ్మకం ఏర్పడింది. ఈ ప్రభుత్వమే కొనసాగాలని దేవుడిని కోరుకొంటున్నా.

- ఓబుళమ్మ, గుండుమల

చంద్రబాబుకు రుణపడి ఉంటాం..



జూలై నుంచి రూ.4వేలు పింఛను అందుకొంటున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడం జీవితంలో మరిచిపోలేని సంఘటన. నెలనెలా పింఛన్ అందుతుండటంతో జీవితం సాఫీగా సాగుతోంది. ఇంటికే వచ్చి పింఛను ఇవ్వడం, అదికూడా ముఖ్యమంత్రి వచ్చి ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

- పులమాసి రామన్న, గుండుమల

వైసీపీ ప్రభుత్వంలో నష్టపోయాం



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మల్బరీ రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో అందించిన డ్రిప్ ఇరిగేషన్ 90 శాతం సబ్సిడీని ఎత్తివేశారు. దీంతో మేము తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. రూ.50 ఇన్‌సెంటివ్ కూడా ఈ ఐదు సంవత్సరాల్లో ఇవ్వలేదు. రీలర్లకు కూడా అందించే రూ.120 సైతం ఇవ్వలేదు.

- రంగనాథ్, మల్బరీరైతు, గుండుమల

మల్బరీ రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం: సీఎం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవస్థలతోపాటు వ్యవసాయ రంగాన్ని కూడా నిర్వీర్యం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. దీనిని బాగు చేయడమే లక్ష్యంగా పెట్టుకొన్నాం. ఓబుళమ్మకు ఇల్లు కేటాయించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు. పేదల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామన్నారు. సీఎం వెంట కలెక్టర్ చేతన్‌తోపాటు ఎస్పీ రత్న, డీఐజీ బాజీజాన్‌సాయ, వివిధ శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

అనంతను అగ్రస్థానంలో నిలుపుతా

- రైతులందరికీ డ్రిప్ సౌకర్యం కల్పిస్తా
- నేనే మీ వద్దకు వస్తా
- పాలకులు, అధికారులు బాధ్యతగా పనిచేయాలి
- పరిశ్రమలతో పెట్టుబడులు తీసుకొస్తా
- వక్క క్రషింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం
- వలస వెళ్లిన వారిని వెనక్కు రప్పిస్తాం
- సీఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన
- గుండుమలలో పింఛన్ పంపిణీకి హాజరు

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి), ఆగస్టు 1: హంద్రీనీవా ద్వారా ప్రతి ఎకరాకు నీరిచ్చి, తోడ్పాటునందించి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి దేశంలోనే ఉమ్మడి అనంత జిల్లా అగ్రస్థానంలో నిలుపుతానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. మడకశిర మండలం గుండుమలకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రికి హెలీప్యాడ్ వద్ద రాష్ట్ర మంత్రులు సవిత, సత్యకుమార్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, బండారు శ్రావణి, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కలెక్టర్, డీఐజీ, ఎస్పీ స్వాగతం తెలిపారు. మొదట మల్బరీ రైతు రంగనాథ్‌కు సంబంధించిన షెడ్డును పరిశీలించారు. పంట సాగులో లాభాలపై ఆరాతీశారు. అక్కడి నుంచి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గుండుమలలోని కరియమ్మ ఆలయం ముందు మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులందరికీ డ్రిప్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నేరుగా మీ వద్దకు వస్తాననీ, మీరు.. నావద్దకు రావాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. తద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులకు బాధ్యత పెరుగుతుందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు కింద జిల్లాలో జీడిపల్లి, భైరవాన్‌తిప్ప, పేరూరు, గొల్లపల్లి ప్రాజెక్టులను ప్రారంభించింది తానేనన్నారు. రూ.12,500 కోట్లతో ప్రాజెక్టు పూర్తి చేశామన్నారు. తద్వారా ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది రైతుల పొలాలకు నీరిచ్చామన్నారు. ఎడారి జిల్లాగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో కియ పరిశ్రమకు నీరిచ్చింది కూడా హంద్రీనీవా ద్వారానేనన్నారు. జిల్లాలో 47 లక్షల ఎకరాల భూమి ఉండగా.. ఇందులో 11 లక్షల ఎకరాలు మాత్రమే సాగుభూమి అన్నారు. పంటలు సాగుచేస్తుంది మాత్రం 2 లక్షల ఎకరాల్లో మాత్రమేనన్నారు. మడకశిర ప్రాంతంలో వక్క రైతులు అధికంగా ఉన్నారన్నారు. ఇక్కడ రైతులందరూ కలిసి వక్క క్రషింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకుందామంటే భూమి, యూనిట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. అలా కాదంటే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి, ఇక్కడ వక్క క్రషింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయనివిధంగా మారుమూల ప్రాంతం గుండుమలకు వచ్చి పింఛన్ ఇచ్చానన్నారు. గత సీఎం జగన్మోహన్ రెడ్డి వస్తే పరదాలు కట్టేవారనీ, చెట్లు నరికేవారనీ, అరెస్టులు చేసేవారన్నారు. తాను మాత్రం జనంలో ఒకడిగా గ్రామానికి వచ్చానన్నారు. జిల్లాలో చాలామంది గత ఐదేళ్లలో వలస వెళ్లారన్నారు. హంద్రీనీవా ద్వారా ప్రతి చెరువుకు నీరందించి, ప్రతి ఎకరాకు నీరిస్తామన్నారు. తద్వారా వలస వెళ్లినవారిని తిరిగి రప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గ్రామానికి అవసరమైన సదుపాయాలన్నీ కల్పిస్తామన్నారు. మల్బరీ రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో అధికంగా వాణిజ్య పంటలు సాగుచేసేలా ప్రోత్సహించి, ఆదుకుంటామన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే, రెండు ఎంపీస్థానాలు గెలిపించినందుకు రుణపడి ఉంటానన్నారు. అనంతను సస్యశ్యామలం చేసి, అన్నివిధాలా అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రభుత్వం జవాబుదారీగా పనిచేస్తుందన్నారు. రూ.35 పింఛన్‌ను ప్రారంభించింది ఎన్టీఆర్ అనీ, దానిని రూ.70కి, తరువాత రూ.1000, రూ.2వేలు, రూ.4వేలు చేసింది ఎన్డీఏ ప్రభుత్వమన్నారు. ఏప్రిల్ నుంచి రూ.4వేలు పింఛన్ ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి, ఈరన్న, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, బండారు శ్రావణి, కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, శ్రీసత్యసాయి, అనంత జిల్లాల అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, వెంకటశివుడుయాదవ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, కలెక్టర్లు చేతన్, వినోద్‌కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వభరత్, ఎస్పీలు రత్న, మురళీకృష్ణ పాల్గొన్నారు.



ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు



గుండుమలలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు

జోరువానలో బాబు ప్రసంగం

హిందూపురం, ఆగస్టు 1: మడకశిర మండలం గుండుమల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజావేదిక వద్ద ప్రసంగించే సమయంలో మొదట మూడు నిమిషాల పాటు తేలికపాటి వర్షం పడింది. ఆ తరువాత 15నిమిషాల పాటు జోరువాన కురిసింది. అయినా చంద్రబాబు ప్రసంగం ఆపలేదు. జోరువానలోనే అక్కడి జనం కుర్చీలు తలపై పెట్టుకుని సీఎం ప్రసంగాన్ని విన్నారు. అంత వర్షం కురుస్తున్నా ఒక్కరూ పక్కకు వెళ్లకుండా ప్రసంగం వినడం పట్ల సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చంద్రబాబు తమ గ్రామానికి రావడంతో వర్షం కురిసిందని గ్రామస్థులు సంబరపడ్డారు. మారుమూల ప్రాంతమైన తమ గ్రామానికి చంద్రబాబు రావడం అదృష్టంగా భావిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

తడిసిన జిల్లా అధికారులు

ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో జోరువాన కురుస్తుండగా కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఐజీ, ఎస్పీ అక్కడే ఉన్నారు. జోరువానలో వారు తడిసి ముద్దయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ తడిసిపోగా జిల్లా ఎస్పీ రత్న డీఐజీకి గొడుగుపట్టి జోరువానలోనే ఉండిపోయారు.

పోరాట యోధుడు ఎంఎస్‌రాజు: సీఎం

మడకశిరటౌన్, ఆగస్టు 1: మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఎప్పుడూ సమస్యలపై పోరాడుతూనే ఉంటాడని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి ఆయన కృషి చేస్తారని పేర్కొన్నారు. గురువారం గుండుమల గ్రామంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు ఎంఎస్‌రాజు సమస్యలపై పోరాడారని, ఇప్పుడు మడకశిర నియోజకవర్గ అభివృద్ధిపై మరొకసారి పోరాటాన్ని ప్రారంభించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని వివరించారు. యువకుడు, ఉత్సాహవంతుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకొన్నారని, అందులోనూ గుండుమల పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి అత్యధికంగా మెజారిటీ అందించారని, అందుకు పంచాయతీ ప్రజలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని సీఎం అన్నారు.



జ్ఞాపికను సీఎంకు అందజేస్తున్న ఎంఎస్ రాజు దంపతులు



వానలో కుర్చీలు తలపై పెట్టుకుని సీఎం ప్రసంగం వింటున్న జనం

మల్బరీ రైతుకు సీఎం అభినందన



రైతుతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న చంద్రబాబు

మడకశిర/మడకశిరరూరల్, ఆగస్టు 1: మల్బరీ సాగులో ఆదర్శంగా నిలిచిన రైతు రంగనాథ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. గురువారం మడకశిర మండలం గుండుమల గ్రామంలో పింఛన్ల పంపిణీ అనంతరం మల్బరీ సాగు చేస్తున్న షెడ్డును సీఎం సందర్శించారు. మల్బరీ సాగుకు సంబంధించిన వివరాలను రైతుతో అడిగి తెలుసుకున్నారు. 15 సంవత్సరాలుగా మల్బరీ సాగు చేస్తున్నామని రంగనాథ్ సీఎంకు తెలిపారు. ప్రస్తుతం ప్రతి పంటకు రూ. 90 వేల వరకు ఆదాయం పొందుతున్నామని, ఇందులో రూ. 60 వేల వరకు లాభం వస్తోందన్నారు. పట్టుగూళ్లకు ప్రభుత్వం కిలోకు రూ. 50 రాయితీ ఇచ్చిందని, ఇందుకు సీఎంకు రైతు కృతజ్ఞతలు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా తాము పొందుతున్న సబ్సిడీ నిలిచిపోయిందని వెంటనే ఇవ్వాలని పట్టు రీలర్స్ ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ మల్బరీ సాగులో మరింత ఆర్థిక అభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలవాలన్నారు. కాగా పట్టుపురుగుల షెడ్డును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని రంగనాథ్ పేర్కొన్నాడు. సీఎం వెంట మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు ఎం.ఎస్.రాజు, కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కలెక్టర్ చేతన్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి ఆర్డీఓ సౌభాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలో కలయతిరిగిన సీఎం

రైతులు, వృద్ధులకు ఆప్యాయ పలకరింపు

హిందూపురం, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మడకశిర మండలంలోని గుండుమల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గ్రామంలో కలియ తిరిగారు. గురువారం సాయంత్రం 4.40 గంటలకు హెలికాప్టర్ ద్వారా గ్రామానికి చేరుకున్న సీఎంకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, కలెక్టర్, డీఐజీ, ఎస్పీ స్వాగతం పలికారు. ఆయన అక్కడి నుంచి గ్రామంలోకి వెళ్లి మల్బరీ షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా గుండుమల గ్రామంలో వీధులవెంట ముఖ్యమంత్రి సామాన్యుడిలా ప్రజల మధ్యన కలియతిరిగారు. గ్రామంలోని రైతులు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు కదిలారు. ఏమమ్మా బాగున్నారా? అంటూ మహిళలను పలుకరించారు. పొలాల్లో ఏ పంటలు పెడుతున్నారు? ఎంతమంది పిల్లలు ఉన్నారు? ఎక్కడ చదువుతున్నారు? ఏం పనిచేస్తున్నారని అందరినీ కుటుంబ సభ్యుడిలా మాట్లాడుతూ ముందుకు కదిలారు.



గ్రామస్థులతో ఆప్యాయంగా చంద్రబాబు

సీఐల బదిలీలు

అనంతపురం క్రైం, ఆగస్టు 1: జిల్లాలో కొందరు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ ఏపీఎస్‌డీఆర్‌ఐలో పనిచేస్తున్న సీఐ రాఘవన్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు, స్పెషల్‌బ్రాంచ్‌లో ఉండి ఎన్నికల సమయంలో డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేసిన సీఐ జాకీర్‌హుస్సేన్ వీఆర్‌కు పంపారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న శ్రీకాంత్‌యాదవ్‌ను అనంతపురం టూటౌన్‌కు బదిలీ చేశారు. టూటౌన్ సీఐ క్రాంతికుమార్‌ను వీఆర్‌కు, డీసీఆర్‌బీ సీఐ సుబ్రహ్మణ్యంను తిరుపతి డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. **శ్రీ సత్యసాయి జిల్లాలో....** తిరుపతి పీటీసీలో పనిచేస్తున్న సీఐ రాజగోపాల్‌నాయుడును హిందూపురం వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. వన్‌టౌన్‌లో పనిచేస్తున్న సీఐ శ్రీనివాస్‌ను వీఆర్‌కు పంపారు. తిరుపతి సీఐడీలో పనిచేస్తున్న ఆంజనేయులును హిందూపురం రూరల్ యూపీఎస్‌కు బదిలీచేయగా హిందూపురం రూరల్ సీఐ శ్రీనివాసులును వీఆర్‌కు పంపారు.

సమగ్రశిక్ష నుంచి అధికారుల రిలీవ్

అనంతపురం విద్య, ఆగస్టు 1: సమగ్రశిక్షలో ఫారిన్ సర్వీసు కింద పనిచేస్తూ మాతృశాఖకు బదిలీ (రీప్యాట్రేషన్) అయిన పలువురు సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులను ప్రాజక్టు నుంచి రిలీవ్ చేశారు. అసిస్టెంట్ ఏఎంఓలు చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అసిస్టెంట్ అలెస్కో గోవింద్‌రెడ్డి, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ రాంప్రసాద్ , జీసీడీఓ మహేశ్వరి రిలీవ్ అయ్యారు. క్లర్కులు జిలాన్, గాయత్రీలను ప్రాజక్టు నుంచి రిలీవ్ చేసినట్లు సమగ్రశిక్ష ప్రాజక్టు అధికారులు తెలిపారు. ప్రాజక్టు నుంచి రిలీవ్ అయిన వారిలో పలువురు ఇప్పటికే జిల్లా విద్యాశాఖలో రిపోర్టు చేసుకున్నారు. అదేవిధంగా ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ సీఎంఓ గోపాల్, అసిస్టెంట్ ఐఈడీ షమా ప్రాజక్టు నుంచి రిలీవ్ చేయడంపై సస్పెన్షన్ కొనసాగుతోంది. వీరిని ఇప్పుడే రిలీవ్ చేస్తారా..? లేక కొత్తగా రిక్రూట్‌మెంట్‌లోని పోస్టులు భర్తీ అయ్యాక రిలీవ్ చేస్తారా..? అన్నది తేలాల్సి ఉంది.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, ఆగస్టు 1: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.27తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 2100 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.17, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు తెలిపారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 1: కర్నూలు జిల్లా గార్లేయపురం-బ్రాహ్మణకొట్కూరు మధ్య హంద్రీనీవాను పూడ్చి కాలువలో తారురోడ్డు వేసి నీటి విడుదలను అడ్డుకున్న రోడ్డు కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగువ కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలవల్ల తుంగభద్ర డ్యాం అన్ని గేట్లు ఎత్తివేసారన్నారు. దీనివల్ల శ్రీశైలం ప్రాజెక్టు పదిగేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. శ్రీశైలం డ్యాంలో నీరు పొంగిపొర్లుతున్నా బ్యాక్‌వాటర్‌పై ఆధారపడిన హంద్రీనీవా కాలువకు నీరు విడుదల చేయలేదన్నారు. హంద్రీనీవా నీటిపై ఆధారపడిన అనంతపురం, సత్యసాయి, కర్నూలు జిల్లాలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో జూలైకి సంబంధించి దాదాపు 64మి.మీ.ల వర్షం కురవాల్సివుండగా కేవలం 17.2మి.మీలు మాత్రమే పడిందన్నారు. ఈ ఖరీఫ్‌లో 3.46లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సివుండగా అత్యల్పంగా 80వేల హెక్టార్లలో మాత్రమే విత్తనాలు వేశారన్నారు. గత ఏడాడితోపాటు ఈ సంవత్సరం కూడా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో తుంగభద్ర డ్యాం నిండి కిందకు నీరు రావడంతో చెరువులు, కుంటలు నిండుతాయని రైతాంగం ఆశించిందన్నారు. అయితే విజయవాడ జాతీయ రహదారి పనుల పేరుతో హంద్రీనీవా కాలువను పూడ్చి, నీటిని అడ్డుకుని రోడ్డు వేయడం అత్యంత దారుణమన్నారు. రాయలసీమ జిల్లాలకు రావాల్సిన నీటిని రాకుండా ఇంతటి దుశ్చర్యకు పాల్పడుతుంటే హంద్రీనీవా అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కాలువ నీటికోసం మోటార్లు వేసుకున్న రైతులపై కేసులు పెట్టి, అపరాధ రుసుం వసూలు చేసే నీటిపారుదల శాఖ అధికారులు కాంట్రాక్టర్ ఏకంగా కాలువనే పూడ్చి తారురోడ్డు వేస్తుంటే ఎందుకు క్రిమినల్ కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో నీటిపారుదలశాఖ అధికారులతో బుధవారం మంత్రి పయ్యావుల కేశవ్ సమీక్ష నిర్వహించి, హంద్రీనీవాకు నీరు విడుదల చేయడంలో ఆలస్యమైందని పేర్కొన్నారని, అయితే ఎందుకు ఆలస్యమైందో చెప్పలేదన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు పెట్టి, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై, కాలువను పూడ్చేసి కళ్లప్పగించి చూస్తున్న నేషనల్ హైవే అధికారులపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణకు ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

అనంతపురం సిటీ, ఆగస్టు 1: ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని పెనుకొండ క్యూసీ విభాగంలో ఏఈఈగా పని చేస్తున్న లక్ష్మీనారాయణకు అనంతపురం పీఆర్‌ఐ డివిజన్-1 ఇన్‌చార్జి డీఈఈగా బాధ్యతలు అప్పగిస్తూ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన స్థానిక ఆ డివిజన్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని మండలాలతోపాటు ఏ. నారాయణపురం, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ, అనంతపురం రూరల్ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి పనులను ఈయన పర్యవేక్షించనున్నారు.

అనిల్‌కుమార్ పూజారికి క్లాసిక్ రేటింగ్



గుంతకల్లు టౌన్, ఆగస్టు 1: పట్టణానికి చెందిన అనిల్‌కుమార్ పూజారికి చెస్‌లో క్లాసిక్ రేటింగ్ లభించింది. విజయవాడలో గత నెల జూలై 12, 13, 14 తేదీల్లో స్పార్క్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంటు జరిగింది. టోర్నీలో అనిల్‌కుమార్ పూజారి ప్రతిభచాటి 15-53 రేటింగ్ సాధించాడు. ఇందుకుగాను ఆయనకు క్లాసిక్ రేటింగ్‌దక్కింది.

తుంగభద్రకు వరద

బొమ్మనహాళ్, ఆగస్టు 1: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. బుధవారం 1,05,973 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి 1,98,109 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం 1633 అడుగులతో 105 టీఎంసీలు ఉండగా గురువారం సాయంత్రం నాటిని 1631 అడుగులతో 97.870 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దిగువన భారీ నీటిని విడుదల చేయడంతో హంపిలోని అనేక మండపాలు, స్మారకాలు నీట మునిగాయి. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. హెచ్చెల్సీ ఆంధ్ర సరిహద్దు 105 కి.మీ. వద్ద 1145 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

సుప్రీంకోర్టు తీర్పుపై సంబరాలు



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం ధర్మవరంలో సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అక్కడి నుంచి ర్యాలీ నిర్వహిస్తూ కళాజ్యోతి సర్కిల్‌కు చేరుకుని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సిరిడి బూదెప్ప, జిల్లా అధికార ప్రతినిధి నాగభూషణం, నాయకులు గజ్జల రామాంజి నేయులు, తాడిమర్రి రామాంజినేయులు, గజ్జల శివ, నాగరాజు, సుధాకర్, రామక్రిష్ణ, నాగేపల్లిబాబు, దర్మపురి రామ్మూర్తి, కొట్టాల రమేశ్, నారాయణ, బావన్న పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మాదిగ జాతికే గర్వకారణమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు హర్షం వ్యక్తం చేశారు.

తీర్పును స్వాగతిస్తున్నాం



ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. ఎస్సీ వర్గీకరణ అంటే గుర్తుకొచ్చేది మందక్రిష్ణమాదిగ. విద్య, ఉద్యోగాల్లో తమకు అన్యాయం జరుగుతోందని ప్రజల్లో అవగాహన కల్పించారు. 30 ఏళ్లు ఎస్సీ వర్గీకరణ కోసం మందక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశాం. ఇప్పటికి మా పోరాటాలకు ఫలితం వచ్చింది. సుప్రీం కోర్టు తీర్పు వల్ల ఎస్సీ ఉపకులాలు అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- బూదెప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్

30 ఏళ్ల శ్రమకు దక్కిన ఫలితం



ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లగా పోరాటాలు సాగించాం. ఇప్పటికి మా శ్రమకు ఫలితం లభించింది. ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని ప్రధాన ఉద్దేశంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాం. ఇందులో ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారు. 2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎస్సీలోని అన్ని ఉపకులాలకు లబ్ధి చేకూరాలని చంద్రబాబునాయుడు రిజర్వేషన్ వర్గీకరించి అమలు చేశారు. అయితే మాల మహానాడు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో సుప్రీంకోర్టులో కేసు నడిచేది. చివరికి సుప్రీంకోర్టు వర్గీకరణపై తీర్పు ఇవ్వడం ఆనంద దాయకం. ఇందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- కేశగాళ్ల శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు

దళిత ఉద్యోగుల హర్షం



కదిరిలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు, ఉద్యోగులు

కదిరి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై దళిత ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, మాదిగ ఉద్యోగ సంఘం ఫెడరేషన్ అధ్యక్షుడు నాగేంద్రనాథ్, శ్రీనివాసులు, విశ్వనాథ్, నరసింహులు, కళ్యాణ్, నాగప్ప, చిన్నప్పయ్య, నాగభూషణ, యల్లమరాజు, బెనర్జీ, శివయ్య పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువులో..



ఓడీసీలో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

ఓబుళదేవరచెరువు: ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లక్ష్మణ, రమణ, బావన్న, కత్తి ఆనంద్, సర్పంచ్ గోవిందు, ఎర్రదొడ్డెప్ప, శ్రీనివాసులు, కదిరప్ప, రామక్రిష్ణ, దారా వెంకటరాముడు, నరసింహులు, నాగభూషణం, రామాంజనేయులు, మహేష్, లక్ష్మీపతి, అక్కులప్ప పాల్గొన్నారు.

కొత్తచెరువులో..

కొత్తచెరువు: స్థానిక ధర్మవరం రహదారిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు సాయిప్రసాద్, బండ్లపల్లి నరసిం హులు, వెంకటరాముడు, పెడబల్లి రంగప్ప, రాజన్న, నాగరాజు, మల్లికార్జున,నరేశ్ పాల్గొన్నారు.



కొత్తచెరువులో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అట్టహాసంగా పింఛన్ల పంపిణీ

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ధర్మవరం పట్టణంలో మంత్రి సత్యకుమార్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే కదిరి పట్టణంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుట్టపర్తి మండలం కప్పలబండ, ఓబుళదేవరచెరువు మండలం డబురువారిపల్లి, కొత్తచెరువు మండలం అప్పలవాండ్లపల్లి, అమడగూరు మండలం కందుకూరిపల్లి, బుక్కపట్నం మండలంలోని జానకంపల్లి, నల్లమాడ మండలంలోని ఎద్దులవాండ్లపల్లి, ఎద్దులవాండ్లపల్లి తండాలో ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. నల్లచెరువు మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు గురువారం 99 శాతం పంపిణీ చేసినట్లు తహసీల్దార్ శకుంతల, ఎంపీడీఓ రాణెమ్మ, ఏపీఎం రవీంద్ర తెలిపారు. గాండ్లపెంట మండలంలో 96 శాతం పూర్తి చేసినట్లు ఇన్‌ఛార్జీ ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. ముదిగుబ్బ మండలంలో గురువారం తెల్లవారుజామున నుంచి అధికారులు, కూటమి నాయకులు ఇంటింటికి వెళ్ళి ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. ధర్మవరంరూరల్ మండలంలో తెల్లవారజామున 5.00 గంటల నుంచే ఫించన్లు పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో అధికారులు, నాయకులు ప్రారంభించారు. తొలిరోజు 96 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. తాడిమర్రి మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు మునిస్వామి పది రోజులుగా బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అగ్రహారం పంచాయతీ కార్యదర్శి రమేశ్, సచివాలయ ఏఎన్ఎం లక్ష్మీకాంత బత్తలపల్లిలోని ఆర్డీటీ వైద్యశాలకు వెళ్లి అతనికి రూ.6 వేల పింఛన్ అందజేశారు. ఎంపీడీఓ మణిమంజరీ సచివాలయ సిబ్బందిని అభినందించారు.



ముదిగుబ్బలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, టీడీపీ నాయకులు



పోతుకుంటలో పింఛన్ పంపిణీ చేస్తున్న తెలుగు మహిళ నేత వెంకటలక్ష్మి



నల్లచెరువు మండలం అల్లుగుండులో పొలం వద్ద పింఛన్ పంపిణీ చేస్తున్న తహసీల్దార్, కార్యదర్శి



గాండ్లపెంట మండలంలోని పోరెడ్డివారిపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

బస్సు కోసం విద్యార్థుల ఆందోళన

కదిరి, ఆగస్టు 1: కదిరి నుంచి కటారుపల్లికి బస్సుసర్వీసు నడపాలని గురువారం విద్యార్థులు బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. వీరికి ఎన్ఎస్‌యుఐ నాయకులు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి పట్టణానికి కళాశాలలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సమయానికి ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పాఠశాలలు, కళాశాలలకు ఆలస్యంగా వస్తుండటంతో హాజరుశాతం తక్కువ కావడం తో పరీక్షలు రాయడానికి అర్హత కోల్పోతున్నారన్నారు. బస్ పాసులిచ్చారే కానీ, బస్సులు లేకపోతే ఎలా ప్రశ్నించారు. ఆందోళనకారుల వద్దకు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ హరిత వచ్చి మాట్లాడారు. బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు శంకర్, హరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిత

రాజంవాండ్లపల్లిలో అదుపులో విష జ్వరాలు

నల్లచెరువు, ఆగస్టు 1: మండలంలోని రాజంవాండ్లపల్లి గ్రామంలో వైరల్ జ్వరాలు అదుపులో ఉన్నట్లు వైద్యాధికారిణి కల్పన గురువారం తెలిపారు. ఈ గ్రామంలో పలువురు సీజనల్ వ్యాధుల బారిన పడటంతో పది రోజుల క్రితం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్థులకు వైద్య చికిత్సలతో పాటు మందులు అందిస్తున్నామని, ప్రస్తుతం జ్వర కేసులు ఏవీ నమోదు కాలేదని తెలిపారు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. గ్రామంలో పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, మున్నా, శ్రీనివాసులరెడ్డి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.



రాజంవాండ్లపల్లిలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

4న కంటి వైద్యశిబిరం

ధర్మవరం, ఆగస్టు 1: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర తెలిపారు. ఈ మేరకు స్వాతి క్లినిక్‌లో గురువారం కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రా లను ఆవిష్కరించిన వారు మాట్లాడా రు. కడపకు చెందిన నేత్రాలయ ఐ క్లినిక్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సుకుమార్, చాంద్‌బాషా, మోహన్, రమేశ్‌బాబు, డాక్టర్ బీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

న్యూరాలజీ, కార్డియాలజీ కూడా..

స్థానిక కదిరి గేటు వద్ద గల కేశవనగర్‌లోని వాసవీ బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా న్యూరాలజీ, కార్డియాలజీ ఉచిత వైద్యశిబిరాన్ని ఈనెల 4న నిర్వహిస్తున్న ట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సత్యసాయి జిల్లా వైస్ ఛైర్మన్ పోలా ప్రభాకర్ తెలిపారు. గురువారం కరపత్రాలను సొసైటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. వైద్యశిబిరాన్ని యువర్స్ ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ట్లు చెప్పారు. నరాల వైద్యనిపుణుడు రవిప్రకాశ్, గుండె వైద్య నిపుణుడు సుభాష్ చంద్ర బోస్ వైద్యసేవలు సేవలందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9494018465 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సత్యనిర్ధారణ గర్రె రమేశ్‌బాబు, వైకే శ్రీనివాసులు, మోహన్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

నల్లమాడ, ఆగస్టు 1: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ సురేష్‌బాబు గురువారం తనిఖీ చేశారు. చౌటకుంటపల్లి, ఎద్దులవాండ్లపల్లి, బాసంవారిపల్లి, పీకేపీ తండాలలోని ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. పెమనకుంటపల్లి తండాలో డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం పరిశీలించారు. రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హేమావతి, వసుంధరా, అనిత, శివమ్మ, ఉపాధ్యాయులు సుధాకర్, వెంకటనారాయణ, శ్రీకాంత్, సీఆర్‌ఎంపీ మదార్‌వలీ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కొత్తచెరువు, ఆగస్టు 1: మండలంలోని అప్పలవాండ్లపల్లి గ్రామంలో సుబ్బారెడ్డి ప్రకృతి వ్యవ సాయం కింద సాగుచేసిన టమోటా పంటను వ్యవసాయ అధికారి నటరాజ్ పరిశీలించారు. రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా, విద్యావతి, ఏఓ అబ్దుల్ అలీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చౌకధాన్యపు డిపోల ప్రారంభం

కొత్తచెరువు, ఆగస్టు 1: మండల కేంద్రంలోని ఏడో చౌక ధాన్యపు డిపోను మాజీ ఎంపీపీ వాణి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాంట్రాక్టు లక్ష్మీనారాయణ, సాలక్కగారి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ హరినాథ్ చౌదరి, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, తులసీ, మణి పాల్గొన్నారు.

కదిరి, (అమడగూరు): అమడగూరులో నూతన చౌకధాన్యపు డిపోను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీలర్ గాయత్రి సర్పంచ్ షబ్బీర్, క్రిష్ణారెడ్డి, సూర్యనారాయణ, డాక్టర్ రామాంజులు, ఆంజి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని శేషయ్యగారిపల్లి తండాలతో ప్రభుత్వ చౌకధాన్యపు డిపోను సర్పంచ్ రేణుకాబాయి, తుమ్మల కుంట్లపల్లిలో డిపోను సర్పంచ్ శ్రీదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో డీలర్లు అంజలిబాయి, రఫీక్, నాయకులు పాల్గొన్నారు.

కటారుపల్లి క్రాస్‌లో చోరీ

గాండ్లపెంట, ఆగస్టు 1: మండలంలోని కటారుపల్లి క్రాస్‌లో ఓబులరెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. ఓబులరెడ్డి ఉపాధి కోసం కుటుంబంతో సహా బెంగళూరుకు వలస వెళ్లాడు. పింఛన్ కోసం గురువారం స్వగ్రామానికి రాగా.. దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి.. చోరీ చేసినట్లు గుర్తించాడు. జత కమ్మలు, నాలుగు ఉంగరాలు, కాళ్ల పట్టీలు చోరీ అయినట్లు గుర్తించాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు పోలీస్ భాస్కర్‌రాజు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

5 నుంచి శ్రావణ మాసోత్సవాలు

నల్లచెరువు, ఆగస్టు 1: పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రావణమాసోత్సవాలు ఈ నెల ఐదో తేదీ నుంచి వచ్చే నెల మూడో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈఓ రవీంద్రరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. శ్రావణమాసంలోని మంగళ, శనివారాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్ర మాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 24న మూడో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ విశ్రాంతి ఉద్యోగులు, ఉద్యోగుల అన్నదానం ఉంటుందన్నారు.



తాగునీటి సంపు పరిశీలన



కార్మికులతో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్

ముదిగుబ్బ, ఆగస్టు 1: స్థానిక దొరిగల్లు రోడ్డులో ఉన్న తాగునీటి సంపును టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ గురువారం పరిశీలించారు. సంబంధిత అధికారులు, కార్మికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, మంత్రి సత్యకుమార్ యాదవ్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకువెళ్ళి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సూర్యశేఖర్ రాజు, త్రిలోక్, మహబూబ్ పీరా, ఆనంద్, రియాజ్, నరేష్, నారాయణస్వామి, నాయుడు, లక్ష్మణ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం రూరల్, ఆగస్టు 1: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని ఓబుళనాయునిపల్లి తండా గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి... ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరం కేసులను గుర్తించి వారికి రక్తనమునాలు సేకరించారు. లార్వాబ్రీడింగ్ పాయింట్స్ గుర్తించి వాటిని తొలగించారు. ఆయన వెంట దర్శినమల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత, అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్, సబ్‌యూనిట్ అధికారి జయరాంనాయక్, హెల్త్‌అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం శివలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ భారతి, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్

పుట్టపర్తి, ఆగస్టు 1: మండలంలోని పెడబల్లి ఉన్నత పాఠశాలలో యజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను హెచ్ఎం రమాదేవి గురువారం విడుదల చేశారు. ఎన్నికలలో పాల్గొనడానికి అర్హత ఉన్న తల్లిదండ్రుల ఓటరు లిస్టు నోటీసు బోర్డులో ఉంచారు. అభ్యంతరాలు 5వ తేదీలోగా తెలియజేయాలని, పూర్తి జాబితా అదే రోజు 4 గంటలకు ప్రదర్శిస్తామని అన్నారు. 8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం తెలిపారు.

నంబులపూలకుంట: స్థానిక జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నూతన యజమాన్య కమిటీ ఎన్నికను ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు శిరీషా తెలిపారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకోనున్నట్లు చెప్పారు.

మినీ గోకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లచెరువు, ఆగస్టు 1: మండలంలో మినీ గోకులాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశువైద్యాధికారి మల్లికార్జున తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా గోకులాల నిర్మాణాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పశువుల కాపర్లకు రాష్ట్రప్రభుత్వం ఈ అవకాశం కల్పిస్తోందన్నారు. 2, 4, 6 ఆవులు కలిగిన రైతులు గోకుల నిర్మాణాలకు రూ.లక్ష 15వేలు, రూ.లక్ష 85 వేలు, రూ.రెండు లక్షలా 30 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీనికి రైతు వాటకింద డీడీల రూపంలో రూ.11,500, అలాగే రూ.18,500, రూ.23వేలు చెల్లించాల్సి ఉందన్నారు. అర్హులను పరిశీలించి, గోకులం షెడ్లను మంజూరు చేస్తామన్నారు. అలాగే గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించుకునేవారి 70 శాతం ప్రభుత్వ భరించి, 30 శాతం రైతు వాటా కింద చెల్లించాల్సి ఉందన్నారు. ఆయా సచివాలయ పరిధిలో ఎహెచ్ఓ ను సంప్రందించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తల్లిపాలపై అవగాహన

తాడిమర్రి, ఆగస్టు1: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లులకు డాక్టర్ హరిత అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాంకుమార్, ఆరోగ్య కార్యకర్తలు జానకీ రాం, రంగనాయకులు, ఏఎన్ఎం కోమల, అంగన్‌వాడీ టీచర్ అలివేళమ్మ, ఆశాకార్యకర్తలు దనమ్మ నరసమ్మ, లక్ష్మీనారాయణమ్మ పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్: తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని దర్శినమల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తల్లులకు వైద్యాధికారి పుష్పలత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి: మండలంలోని నిడిమామిడి, కొట్లపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మునిచంద్ర, సీహెచ్‌ఓ నగేశ్, సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని కొక్కంటి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ ప్రారంభించారు. తల్లిపాలు విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, ఎంపీహెచ్‌ఈఓ ఓబులేసు, సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో తల్లి పాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఆర్డీటీ వైద్యులు రేణుక, సునీల్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కమతం కాటమయ్య

బత్తలపల్లి, ఆగస్టు 1: బత్తలపల్లి మండలం యర్రాయపల్లికి చెందిన సీపీఐ నాయకుడు కమతం కాటమయ్యను సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అధిష్టానం గురువారం నియమించింది. ప్రజల సమస్యపై నిరంతరం పోరాటం చేసి పార్టీని బలోపేతం చేస్తానని ఆయన తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి



రామాంజనేయులు మృతదేహం

ధర్మవరం రూరల్, ఆగస్టు 1: మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన రామాంజనేయులు (54) ధర్మవరం రైల్వే స్టేషన్‌లో గుండెపోటుతో గురు వారం మరణించాడు. ఇతను బెంగుళూరులో బార్బర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. పీర్లపండుగ నేపథ్యంలో వారం క్రితం స్వగ్రామానికి వచ్చాడు. తిరిగి గురువారం బెంగుళూరుకు వెళ్లేందుకు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైల్వేస్టేషన్‌లో గుండె నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. తోటి ప్రయాణి కులు పోలీసుల సహాయంతో ధర్మవరం ప్రభుత్వాసు పత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రామాంజనేయులుకు భార్య సరోజ, ఒక కూతురు ఉంది. రైల్వేపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రికి గౌన్లు, మాస్కుల వితరణ

కదిరి, ఆగస్టు 1: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి శస్త్రచికిత్స చేయడానికి ఉపయోగించే రూ.35 వేల విలువైన గౌన్లు, మాస్కులు రోటరీ క్లబ్ కదిరి శాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ సవి. మదన్‌కుమార్ అందించారు. వాటిని గురువారం ఆసుపత్రి సూపరిం టెండెంట్ హుస్సేన్‌కు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నితిన్, సభ్యులు నాగార్జున, పచ్చిపులుసు రామవేంద్ర, శ్రీనివాస్, కిషోర్‌కుమార్‌రెడ్డి, రంజిత్, తాయి శ్రీనివాసులు, మహేశ్వర్‌రెడ్డి, అభినయ్, గణేష్, నామా రఘు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీని పరిశీలించిన కలెక్టర్, సెర్ప్ సీఈఓ


వెంకటరెడ్డిపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ చేతన్


దుద్దేబండలో పింఛన్ పంపిణీపై ఆరాతీస్తున్న సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్

పెనుకొండ రూరల్, ఆగస్టు 1: పింఛన్ సొమ్మును జాగ్రత్తగా ఖర్చుచేసుకోవాలని జిల్లా కలెక్టర్ చేతన్, సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్ లబ్ధిదారులకు సూచించారు. వారు గురువారం మండలంలోని వెంకటరెడ్డిపల్లి, దుద్దేబండ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటివద్దకు వెళ్లి పింఛన్ అందించే బాధ్యతను సచివాలయ ఉద్యోగులు తీసుకోవాలని వారు సూచించారు. లోటుపాట్లు లేకుండా పింఛన్లు సరిగా పంపిణీచేయాలని ఆదేశించారు.

గుడిబండలో మోస్తరు వర్షం

గుడిబండ, ఆగస్టు 1: మండలంలోని ఎస్ రాయాపురం, కొంకల్లు, ఎస్ఎస్‌గుండ్లు, పూజారిపల్లి తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు సాగుచేసిన వేరుశనగ, కందులు, ఉలవ, జొన్న తదితర పంటలు పచ్చదనంతో కళకళలాడుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఆగస్టు 1: తల్లిదండ్రులు మందలించారని సంధ్య అనే విద్యార్థిని క్రిమిసంహారక మందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చిలమత్తూరు మండలంలోని కల్లుగుంట గ్రామానికి చెందిన నరసింహప్ప కుమార్తె సంధ్య డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు ఆమెను మందలించారన్న ఆగ్రహంతో క్రిమిసంహారక మందును అధిక మోతాదులో తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలో ఉండగా ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి, పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో హిందూపురం తరలించారు.

పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించండి

ఏపీడీ శివానందనాయక్

గోరంట్ల, ఆగస్టు 1: మండలంలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా రైతులు విస్తృతంగా పండ్ల తోటలు పెంపకం చేపట్టేలా కృషి చేయాలని ఏపీడీ శివానందనాయక్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లుతో ఆయన సమీక్షించారు. మండలంలోని కూలీలకు ఉపాధి పనులు కల్పించా లన్నారు. పెండింగ్ బిల్లులు వారం, పదిరోజుల్లో కూలీల ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉందన్నారు. పండ్లతోటల పెంపకానికి ఇప్పటికే గుర్తించిన రైతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపి, మంజూరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఏపీఓ వరప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


కలిగెరి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీఓ అనూరాధ

గోరంట్ల, ఆగస్టు 1: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సోమందేపల్లి సీడీపీఓ అనూరాధ గురువారం తనిఖీ చేశారు. గోరంట్ల మార్కెట్‌వీధి, మల్లాపల్లి, బూగానిపల్లి, కలిగేరి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి హాజరు రిజిస్టర్లను, ఆహార పదార్థాల నిల్వలను పరిశీలించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రీస్కూల్ సజావుగా కొనసాగించాలన్నారు. కేంద్రాల నిర్వాహణ, పనితీరుపై పిల్లలు, తల్లిదండ్రులతో విచారించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్ర ంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత, కార్యకర్త పద్మ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న దాతలు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 1 : సోమందేపల్లి మండల పరిశాటలోని గుడిపల్లి అంగనవాడీ కేంద్రంలో విద్యార్థులకు దాతలు గురువారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. బెంగళూరుకు చెందిన శాంతమ్మ, రంగయ్యశెట్టి జ్ఞాపకార్థం కుమారుడు మురళి సత్యనారాయణ 30మంది విద్యార్థులకు బ్యాగులు, నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులు, వాటర్‌బాటిళ్లు అందజేశారు. ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.30వేలు విలువచేసే నీటి మోటారు, స్టార్టర్ బాక్సును అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ అనురాధ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగనవాడీ యూనియన్ నాయకురాలు శ్రీదేవి, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంగప్ప, రమణ, నాగరత్న, శోభరాణి పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్, ఆగస్టు 1: మండలంలోని మలుగూరు, రంగేపల్లి స్టేషన్ మధ్య గురువారం రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మలుగూరు, రంగేపల్లి స్టేషన్‌ల మధ్యలో నడుస్తున్న హంపీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి అతడు మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ ఫోన్ నంబర్లు 9398866299, 9490798793 నంబర్లలో సమాచారం అందించాలని వారు తెలిపారు.

పాడి ఆవు మృతి

గుడిబండ, ఆగస్టు 1 : మండలంలోని బళ్లేగట్ట గ్రామంలో రంగనాథ్ అనే వ్యక్తికి చెందిన పాడిఆవు గురువారం మృతిచెందింది. అతడు ఉదయం మేతకోసం పాడిఆవును పొలంలోకి తోలుకెళ్లాడు. ఉన్నట్టుండి కిందపడి మృతిచెందిందని బాధితుడు తెలిపాడు. ఆవును రూ.1.20లక్షలతో కొనుగోలు చేశామన్నాడు. అప్పులు చేసి కొనుగోలు చేశానని, దాని మృతితో అప్పులపాలయ్యానని విలపించాడు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

గుట్టూరు జడ్పీహెచ్‌ఎస్ తనిఖీ చేసిన మంత్రి


విద్యార్థులకు డైరీలు పంపిణీ చేసిన మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఆగస్టు 1: విద్యార్థులు కష్టపడి చదివి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి సవిత సూచించారు. పెనుకొండ మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి సవిత గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం గు ట్టూరు జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ముందుగా పాఠశాలలోని విద్యార్థులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ... పుస్తకాలు, బ్యాగులు, నాణ్యమైన భోజనం అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ సర్పంచ్ సూర్యనారాయణ సమక్షంలో పాఠశాలలో 270మంది విద్యార్థులకు డైరీలను అందజేశారు. అనంతరం విద్యార్థులతో సెల్ఫీ దిగారు. అనంతరం మంత్రి గుట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి సూచలను అందించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గుట్టూరు సుబ్బరాయుడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు


పీహెచ్‌సీలో సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి సవిత

పింఛన్ల పండుగ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఒకటో తేదీ గురువారం ఉద్యోగులు ఉదయం 6 గంటలకే ప్రారంభించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలిసి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో మొత్తం 2857మందికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. 14వ వార్డులో టీడీపీ నాయకులు నిస్సార్, సమీవుల్లా, అధి కారులు పాల్గొన్నారు. గోరంట్ల మండలంలోని పులేరు పంచాయతీలో ఉదయం 5గంటలకే పంపిణీ ప్రారంభించగా, మిగిలిన ప్రాంతాల్లో ఉదయం 6గంటల నుంచి పంపిణీ చేశారు. మండలంలోని 11,535మందికి గాను సాయంత్రం 4గంటల వరకు 11,026మందికి పింఛన్లు అందించి, 95.55 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. చిలమత్తూరు మండలంలో గరువారం 90 శాతం వరకు పంపిణీ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సోమందేపల్లి మండల వ్యాప్తంగా 6842పింఛన్లు ఉండగా 99శాతం పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. గుడిబండ మండలంలో గురువారం 97శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ బంగారమ్మ, ఏఓ నారాయణప్ప తెలిపారు. మిగిలిన 3శాతం శుక్రవారం పూర్తిచేస్తామని తెలిపారు. అగళిలో జడ్పీటీసీ ఉమేష్ తదితరులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.


గోరంట్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


సోమందేపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు


పెనుకొండ 14వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు


చిలమత్తూరులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న జడ్పీటీసీ అనూష


అగళిలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న జడ్పీటీసీ ఉమేష్, అధికారులు

రేషన్ దుకాణాల ప్రారంభం


మార్కెట్‌వీధిలో బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, ఆగస్టు 1: మండల వ్యాప్తంగా నూతన డీలర్లను నియమించిన పలు చౌకధాన్యపు దుకాణాలను గురువారం టీడీపీ, జనసేన, బిజెపీ నాయకులు పాల్గొని ప్రారంభించా రు. టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు నిమ్మల చంద్ర శేఖర్, నిమ్మల యువశేఖర్, అశ్వత్థరెడ్డి, బాలక్రిష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్ తదితరులు ప్రజలకు బియ్యం పంపిణీ చేసి, ప్రారంభ వేడుకల్లో పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలకు స్వస్తి చెప్పాలి: బీఎస్పీ



తాలూకా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

పావగడ, ఆగస్టు 1 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్యారెంటీ పథకాలకు ఎస్సీ, ఎస్టీ నిధులను వినియోగించడం తగదని, అవసరమైతే ఆ పథకాలకు స్వస్తి పలకాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం పావగడలో ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ తాలూకా అధ్యక్షుడు హనుమంతరాయ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి, గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాలువలు పక్కాగృహాల నిర్మాణం కోసం ఎన్నో పథకాలు చేపట్టిందన్నారు. అయితే గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలనిధులను పక్కదోవ పట్టించి వారికి ద్రోహం చేస్తోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉచిత గ్యారెంటీ పథకాలను రద్దుచేసి ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. లేనిపక్షంలో విధాన్‌సభ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పురంలో బురఖా వ్యక్తి సంచారం

భయాందోళనలు వ్యక్తం చేస్తున్న ప్రజలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 1: పట్టణ పరిధిలోని నానెప్పనగర్‌లో బురఖా ధరించి ఓ పురుషుడు తిరుగున్నాడని స్థానికులు భయం వ్యక్తం చేస్తున్నారు. బురఖా ధరించిన వ్యక్తి తిరుగుతండటాన్ని గురువారం స్థానికులు గమనించి భయపడి ఇంటిలోకి వెళ్లి తులుపులు వేసుకున్నారు. కిటికిలో నుంచి చూడగా అతడు చెట్టు చాటున నక్కి ఉన్నాడని పలువురు మాట్లాడుకుంటున్నారు. ఇంటివద్దకు వచ్చి అన్నం పెట్టు అని అడిగాడని, అయితే తాను భయపడి ఇంటిలోని వారిని పిలిచేలోగా అక్కడ నుంచి ఉడాయించాడని ఓ మహిళ చెబుతోంది. ముఖ్యంగా రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ప్రాంతం ఉందని, అటుగా పలువురు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు స్థానికులు అంటున్నారు. పోలీసులు నిఘా వుంచి ఏదైన ఘటన జరుగక ముందే చర్యలు చేపట్టాలని నానెప్పనగర్ వాసులు కోరుతున్నారు. ఇదిలాఉంటే గత వారంలో నానెప్పనగర్‌లోని బాలాజీ ఆలయం రోడ్డులో పట్టపగలే ఓ ఇంటి ఆవరణలో ఉన్న ఇనుప మంచాలు, ప్లాస్టిక్ కుర్చీలు ఎవరో ఎత్తుకెళ్లారని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీఎస్పీ కంజక్షన్‌ను అడుగగా.... గతంలో కూడా ఇలాంటి ఘటన ఒక సారి చోటు చేసుకుందని తెలిపారా. ఇప్పుడు పునరావృతం అవుతున్నట్లు ప్రజల నుంచి తెలుస్తోందన్నారు. దీనిపైన పగలు, రాత్రి బీట్ ఏర్పాటు చేస్తామని, ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బుక్కరయసముద్రం, ఆగస్టు 1: మండలంలోని రెడ్డిపల్లి గ్రామం వద్ద అనిల్ (32) అనే వ్యక్తి ద్విచక్రవాహనం అదపు తప్పి కింద పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు గోవిందంపల్లి గ్రామానికి చెందిన అనిల్ అనంతపురంలోని సెల్‌ఫోన్ దుకాణంలో పని చేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం వ్యక్తిగత పనిమీద ద్విచక్రవాహనంలో వెళ్తుండగా రెడ్డిపల్లి గ్రామం సీమపంలో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం అనంతపురం అస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అనిల్‌కు భార్య ఇద్దరు పిల్లలున్నారు. బుక్క రాయసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శింగనమల ఆగస్టు 1: మండలంలోని తరిమెల ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం తరిమెల ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో పేకాటస్థావరంపై ఎస్ఐ పోలీస్ సిబ్బందితో దాడి చేసి నలుగురుని అరెస్టు చేసి వారి నుంచి రూ.18370, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం


నూతన వ్యాపార సముదాయ భవనం

హిందూపురం అర్బన్, ఆగస్టు 1: వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన హిందూపురంలో మున్సిపల్ అధికారులు మూడు అంతస్తుల వ్యాపార సముదాయ భవనం నిర్మించారు. కానీ అందులో కొన్ని దుకాణాలను మాత్రమే వ్యాపారులు అద్దెకు తీసుకుని వ్యాపారులు నిర్వహిస్తున్నారు. మిగిలిన గదులన్నీ ఖాళీగా ఉన్నాయి. గౌండ్ ఫ్లోర్‌లో పూల వ్యాపారులు ఉండగా, మొదటి అంతస్తులో మాత్రం అక్కడక్కడ కొంత మంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. వివిధ కారణాల వల్ల వ్యాపారులు గదులను అద్దెకు తీసుకోనట్లు తెలుస్తోంది. చాలామంది బయటే వ్యాపారాలు చేసుకుంటుండటంతో వ్యాపార సముదాయ భవనం చాలా వరకు ఖాళీగా ఉంది. ఇదే అదునుగా కొంత మంది అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మందు బాబులు బార్‌లా మార్చుకున్నారు అనేందుకు అక్కడ కుప్పలు తెప్పలుగా పడిఉన్న కర్ణాటక టెట్రా పాకెట్‌లు, మద్యం బాటిళ్లే నిదర్శనం. ఇక పేకాట, మట్కా యథేచ్ఛగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా పదుల సంఖ్యలో అక్కడే ఉంటున్నారు. దీంతో ఉన్న కొంత మంది

వ్యాపార సుముదాయంలో మద్యపానం

వ్యాపారులు... ఎక్కడ దొంగతనాలు జరుగుతాయో అని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పగటి పూట భయం లేకుండా పై అంతస్తులోకి వచ్చి వెళ్తున్నారని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు ముందు అక్కడ వాచ్‌మన్ ఉండే వాడు. జీతాలు ఇవ్వక పోవడంతో అతడు వెళ్లిపోయినట్లు సమాచారం. దీంతో ఆకతాయిలకు మరింత స్వేచ్ఛ దొరికిందని జనం అంటున్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత రెడ్డిని వివరణ కోరగా.... ఇంతకు మునుపు వ్యాపార సముదాయ భవనానికి సెక్యూరిటీ ఉండేవాడన్నారు. తరువాత ఏజెన్సీ వారు తొలగించారని తెలిపారు. కొత్తగా సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదనకు పెట్టామని, త్వరలో నియమిస్తామని తెలిపారు.



కుప్పలు తెప్పలుగా పడివున్న మద్యంపాకెట్లు, బాటిళ్లు
వ్యాపారులు లేకపోవడంతో దుమ్ముపట్టిన భవనం

సుప్రీం తీర్పు పట్ల సంబరాలు


ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెనుకొండ, ఆగస్టు 1 : ఎస్సీవర్గీకరణకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇవ్వడాన్ని హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, కోనాపురం పెద్దన్న, బీజేపీ జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ మందకృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి స్వీట్లు తినిపించారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రధాని



ప్రధాని మోదీ ఎన్నికలకు ముందు తెలంగాణలో జరిగిన మాదిగల విశ్వరూప సభకు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం త్రిసభ్య కమిటీవేసి నివేదికను సుప్రీంకోర్టుకు అందజేయడం జరిగింది. సుప్రీంకోర్టు మాదిగ ఉపకులాలకు అనుకూలంగా తీర్పు ఇచ్చింద న్నారు. ఇందుకు సహకరించిన ప్రధాని మోదీ, ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు జిల్లా తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. **- పెద్దన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్**


సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోరంట్ల: ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు మండలకేంద్రంలోని బస్టాండ్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, బాణసంచా పేల్చి సంబరాలు జరిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

చిలమత్తూరు: ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షించదగ్గ విషయమని టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బేకరీ గంగాధర్ పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎమ్మార్పీఎస్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పెద్ద ఎత్తున మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.


పరిగిలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమార్పీఎస్ నాయకుల నినాదాలు

హిందూపురం(పరిగి): ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం పరిగిలోని వైఎస్సార్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజినప్ప, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


మడకశిరలో దళిత సంఘం నాయకుల సంబరాలు

మడకశిరటౌన్: పట్టణంలో దళిత సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు అంజినప్ప, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.


అగళిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

అగళి: ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. బాణసంచా పేల్చారు. నాయకులు నాగోజీ, క్యాతప్ప, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని టీడీపీ ఎస్సీసెల్ జిలా అధ్యక్షుడు మంజునాథ్ తెలిపారు. కొన్ని దశాబ్దాల కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పుడు ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే దీన్ని అమలు చేయాలని కోరారు.

పావగడ : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పుపై పావగడలోని దళిత సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రులు క్యాబినెట్‌లో చర్చించి వారి రాష్ట్రాల జనాభాకు అనుగుణంగా వర్గీకరణ చేయాలని తీర్పు ఇవ్వడంపై సంబరాలు చేసుకున్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ పేర్కొన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. సుప్రీంతీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. మాదిగల 30 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్గీకరణకు సానుకూలంగా వ్యవహరించిందన్నారు. దళితులు ఐకమత్యంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలని కోరారు.

విద్యార్థినికి గాయాలు

అనంతపురం క్రైం, ఆగస్టు 1: రోడ్డు క్రాస్ చేస్తుండగా స్కూటర్ ఢీకొనడంతో ఓ విద్యార్థిని గాయపడింది. బుక్కరాయసముద్రం మండలం సరళాదేవినగర్‌కు చెందిన మోక్షిత గురువారం బస్సు ఎక్కడానికి గుత్తి రోడ్డుకు వచ్చింది. రోడ్డు క్రాస్ చేస్తుండగా వేగంగా వస్తున్న స్కూటర్ ఢీకొట్టింది. మోక్షిత కాలికి తీవ్రగాయమైంది. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.